



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 9 సంచిక : 359 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : కాకినాడ | శనివారం 29 ఆగస్టు 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :9 ISSUE :359 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : KAKINADA | SAT 29 AUGUST 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## రాఖీ పండుగకు టీజీఎస్ఆర్టీసీ ఛార్జీల బాదుడు

- రాఖీ పండుగ సందర్భంగా టీజీఎస్ఆర్టీసీ ఛార్జీల పెంపు
- ప్రత్యేక బస్సుల్లో సాధారణ ఛార్జీపై 50 శాతం అదనం
- రాష్ట్రవ్యాప్తంగా 5,000 ప్రత్యేక బస్సు సర్వీసులు
- 1981 నాటి జీవో ప్రకారమే పెంపు అని అధికారుల వెల్లడి
- సాధారణ సర్వీసుల్లో ఛార్జీలు యథాతథం

- మిగతా 2లో



## రేవంత్ రెడ్డికి రాఖీ కట్టిన కొండా సురేఖ.. రాజకీయాలు మాట్లాడనని వ్యాఖ్య

- రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లిన కొండా సురేఖ
- రేవంత్ తో పాటు ఆయన అల్లుడు, మనవడికి రాఖీ కట్టిన సురేఖ
- రాష్ట్రంలోని ఆడబిడ్డల ఆశీస్సులు రేవంత్ కు ఉంటాయని వ్యాఖ్య

- మిగతా 2లో



### కన్నీళ్లతో కర్ణాటక మంత్రి పదవికి నాగేంద్ర రాజీనామా..

## రెండేళ్లలో ఇది రెండోసారి!

- వాల్మీకి కార్పొరేషన్ స్కామ్‌లో కర్ణాటక మంత్రి నాగేంద్ర రాజీనామా
- రెండు సంవత్సరాల్లో ఇదే ఆరోపణపై పదవి వీడటం ఇది రెండోసారి
- ప్రెస్ మీట్‌లో తన రాజీనామా ప్రకటిస్తూ కన్నీటిపర్యంతమైన కాంగ్రెస్ నేత
- బీజేపీకి గిరిజన వ్యతిరేక మనస్తత్వం ఉందంటూ నాగేంద్ర ఆరోపణ
- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై బీజేపీ పాదయాత్రకు సన్నాహాలు

- మిగతా 2లో



## నేపాల్‌లో జల ప్రళయం.. 547కి చేరిన మృతుల సంఖ్య

- నేపాల్‌లో ఆకస్మిక వరదలు
- వందల మంది గల్లంతు, కొనసాగుతున్న గాలింపు చర్యలు
- భోటేకోషి నదిలో పెరుగుతున్న నీటిమట్టంతో సహాయక చర్యలకు ఆటంకం
- హిమానీనదం కూలడమే ఈ పెను విపత్తుకు కారణమని అనుమానం
- నేపాల్, చైనాతో పాటు పలు దేశాలు సహాయక చర్యల్లో భాగస్వామ్యం



పెన్ పవర్ డెస్క్:నేపాల్-టిబెట్ సరిహద్దులోని హిమాలయ ప్రాంతంలో సంభవించిన ఆకస్మిక వరదలు పెను విషాదాన్ని మిగిల్చాయి. ఈ జల ప్రళయంలో నేపాల్‌లో మరణించిన వారి సంఖ్య 547కి పెరిగినట్లు అధికారులు ధృవీకరించారు. వందలాది

- మిగతా 2లో

# నియోజకవర్గాల విజన్ ప్లాన్.. పనితీరుకు అదే ప్రామాణికం

- ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్
- ప్రజాప్రతినిధులు నిరంతరం సమీక్షలు జరుపుతూ ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ఆదేశం
- అన్ని స్థాయిల్లో పొలిటికల్ గవర్నెన్స్, ప్రజా భాగస్వామ్యంతోనే మెరుగైన ఫలితాలు
- టెక్నాలజీని వాడుకుంటూ వినూత్నంగా ఆలోచించాలని సూచన
- రాష్ట్ర విజన్ ప్లాన్ యూనిట్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని వెల్లడి



పెన్ పవర్ డెస్క్:రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపడం, పేదరిక రహిత సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'స్వర్ణ నియోజకవర్గం విజన్ యాక్షన్ ప్లాన్' పనితీరుకు ప్రామాణికంగా నిలుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ ప్రణాళిక అమలులో ప్రజాప్రతినిధులు, అధికారులు కీలక పాత్ర పోషించాలని, ప్రజల భాగస్వామ్యంతోనే అద్భుత ఫలితాలు సాధించగలమని ఆయన దిశానిర్దేశం చేశారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్లపై ముఖ్యమంత్రి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లతో పాటు యంగ్ ప్రొఫెషనల్స్, నాలెడ్జ్ పార్ట్‌నర్స్‌తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. నియోజకవర్గాల వారీగా నిర్దిష్ట విజన్ ప్లాన్‌ను రూపొందించుకుని అమలు చేయడం దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌లో ప్రప్రథమంగా జరుగుతోందని, ఈ వినూత్న కార్యక్రమానికి జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు లభించిందని ముఖ్యమంత్రి తెలిపారు. కీ-పెర్ఫామెన్స్ ఇండికేటర్లకు అనుగుణంగా ప్రతి రంగంలో వృద్ధి సాధించేలా పనిచేయాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. క్షేత్రస్థాయిలో నిర్వహించే సమీక్షలు మొక్కుబడిగా కాకుండా, ప్రజలకు పూర్తిగా జవాబుదారీగా ఉండేలా చూడాలని ఆదేశించారు. అన్ని స్థాయిల్లోనూ పొలిటికల్ గవర్నెన్స్ సమర్థవంతంగా అమలైనప్పుడే సుపరిపాలన సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ నిర్ణయాలు, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములను చేసినప్పుడు అద్భుత ఫలితాలు వస్తాయని, ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నమైన భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి లభించిన ప్రజా స్పందనే ఇందుకు నిదర్శనమని గుర్తుచేశారు. ఈ విజన్ ప్లాన్ అమలులో యంగ్ ప్రొఫెషనల్స్, నాలెడ్జ్ పార్ట్‌నర్లు, స్వర్ణ కార్యాలయాల సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని సీఎం పేర్కొన్నారు. సంప్రదాయ

- మిగతా 2లో

## పదోసారి సవాల్ చేస్తున్నా.. డేట్-టైమ్-ప్లేస్ ఫిక్స్ చెయ్ జగన్.. చర్చకు నేను రెడీ

- ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమన్వయ సమావేశంలో లోకేశ్
- ఏపీపీఎస్సీ, డీఎస్సీకి తేడా తెలియని అజ్ఞాని జగన్ అని విమర్శ
- సార్వత్రిక ఎన్నికల కన్నా 2 శాతం ఎక్కువ ఓట్లతో స్థానిక ఎన్నికల్లో గెలుస్తామన్న ధీమా
- జగన్ తప్పుడు పనుల వల్లే వైసీపీ నేతలు జైళ్లకు వెళుతున్నారని ఆరోపణ
- మరో మూడుసార్లు గెలిస్తేనే రాష్ట్రం గాడిన పడుతుందని వ్యాఖ్య



పెన్ పవర్ డెస్క్:"జగన్.. నీకు పదోసారి సవాల్ విసురుతున్నా. డేట్, టైమ్, ప్లేస్ ఫిక్స్ చెయ్. పులివెందులకు రమ్మన్నా వస్తా, తాడేపల్లిలోని నీ కొంపకు రమ్మన్నా వస్తా. చర్చకు నేను సిద్ధం, నువ్వు సిద్ధమా? ఏపీపీఎస్సీకి, డీఎస్సీకి తేడా తెలియని నువ్వు నాకు నీతులు చెబుతావా?" అంటూ విద్యాశాఖ మంత్రి, తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమన్వయ సమావేశంలో ఆయన శుక్రవారం పాల్గొని ప్రసంగించారు. జగన్ లాంటి చేతకాని నాయకుడిని తాను ఎన్నడూ చూడలేదని, ఆయనకు నిజం చెబితే తల వెయ్యి ముక్కలయ్యే శాపం ఉందని ఎద్దేవా చేశారు.

- మిగతా 2లో

## పచ్చదనం సంకల్పాన్ని నాగబాబు సమర్థంగా నెరవేర్చాలి



- ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నాగబాబు
- రాష్ట్రంలో పచ్చదనాన్ని 50 శాతానికి పెంచడమే లక్ష్యమన్న పవన్
- ఈ భారీ ప్రాజెక్టును నాగబాబు సమర్థవంతంగా ముందుకు తీసుకెళతారని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా జనసేన ఎమ్మెల్సీ నాగబాబు కేబినెట్ హోదాతో బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా నాగబాబుకు ఆయన సోదరుడు,

- మిగతా 2లో

## గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన నాగబాబు



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా ప్రముఖ నటుడు, జనసేన ఎమ్మెల్సీ నాగబాబు బాధ్యతలను స్వీకరించారు. మంగళగిరిలోని అరణ్యభవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో తన భార్య పద్మజతో

- మిగతా 2లో

## ఒంగోలు సమీపంలో రాడిసన్ 5 స్టార్ హోటల్: శంకుస్థాపన చేసిన మంత్రి నారా లోకేశ్

- రూ. 100 కోట్లతో చదలవాడ వద్ద 5 స్టార్ హోటల్
- రవిశంకర్ గ్రూప్, రవిప్రియ హాస్పిటాలిటీస్ ఎల్ఎల్‌పీ సంస్థల సంయుక్త భాగస్వామ్యంలో హోటల్
- హాస్పిటాలిటీ, టూరిజం, రవాణా, సేవా రంగాల్లో స్థానిక యువతకు ఉపాధి



పెన్ పవర్ డెస్క్:ఏపీ మంత్రి నారా లోకేశ్ ప్రకాశం జిల్లా పర్యటన సందర్భంగా ప్రాంతీయ అభివృద్ధికి సంబంధించి ఒక కీలక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. ఒంగోలు పరిసర ప్రాంతమైన చదలవాడ వద్ద రూ. 100 కోట్ల అంచనా వ్యయంతో

- మిగతా 2లో

## తెలంగాణలో పెరిగిన క్రైమ్ రేట్.. ఆందోళనకరంగా ఆర్గనైజ్డ్ క్రైమ్, డ్రగ్స్ కేసులు

- తెలంగాణలో మూడేళ్లలో 7.15 శాతం పెరిగిన మొత్తం నేరాలు
- నార్కోటిక్స్ కేసులు 46 శాతం పెరగడంపై ఆందోళన
- సైబర్ క్రైమ్, ఆర్థిక నేరాల్లో కనిపించిన తగ్గుదల
- తీవ్రమైన నేరాలు తగ్గినా, సాధారణ నేరాలు పెరిగాయన్న గణాంకాలు



పెన్ పవర్ డెస్క్:తెలంగాణలో గత మూడేళ్లతో పోలిస్తే మొత్తం నేరాల సంఖ్య 7.15 శాతం మేర పెరిగింది. ముఖ్యంగా మాదకద్రవ్యాలు (నార్కోటిక్స్) సంబంధిత కేసులు

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

### : ఒకవైపు అధికార పార్టీ బలం..
### మరొకవైపు జగన్ హెచ్చరిక

స్థానిక సంస్థల ఎన్నికలు వైసీపీ నేతల కు ఫీవర్ తెచ్చి పెడుతున్నాయి. బలమైన అభ్యర్థులు, నమ్మకమైన నేతల కోసం ఇప్పటి నుంచే ఆరా తీస్తున్నారు. ప్రధానంగా పదహారు కార్పొరేషన్ లలో మేయర్ పదవి, మున్సిపల్ ఛైర్మన్ ల ఎంపిక వైసీపీ ఇన్ ఛార్జులకు తలనొప్పిగా మారనుంది. అధికార పార్టీని ఎదుర్కొనడం స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో అంత ఈజీ కాదు. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం అన్ని రకాలుగా బలంగా ఉంటుంది. ఆర్థికంగా, ఇటు అధికారుల నుంచి సహకారం, మరొకవైపు ఓటర్ల మనోగతం కూడా ఈ ఎన్నికల ఫలితాలను ప్రతిబింబిస్తాయి. మూడేళ్లు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటంతో తమకు ఎంతో కొంత మేలు, పనులు జరగాలంటే అధికార పార్టీని గెలిపించుకోవడం మంచిదని ప్రజలు సహజంగా విశ్వసిస్తారు. అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీ వైపు ప్రజలు మొగ్గ చూపుతారు.

**స్థానిక సంస్థల ఎన్నికలు కావడంతో...**

కూటమి ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తి సాధారణ ఎన్నికల వరకూ బయటపడదు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అసంతృప్తి కనపరిస్తే తమ నగరం, పట్టణం అభివృద్ధి జరగదని భావిస్తారు. ఇక అధికార పార్టీ సామ, దాన, భేద, దండోపాయాలను ఖచ్చితంగా తమ విజయం కోసం ప్రయోగిస్తుంది. ఆ వత్తిడిని ఎదుర్కొని తట్టుకుని నిలబడే నేత కావాలంటే అధికారంలోని వైసీపీకి అంత సులువు కాదు. ఆర్థికంగా బలంగా ఉండాలి. తన తో పాటు తన వార్డు మెంబర్లకు కూడా ఆర్థిక సాయాన్ని అందించగల నేత అయి ఉంటేనే ఎంతో కొంత తట్టుకోగలరు. అలాగే పార్టీ పట్ల విధేయత, నాయకత్వం పట్ల నమ్మకం ఉన్న నేత కూడా అవసరం. లేకుంటే అధికార పార్టీ ప్రలోభాలకు లొంగిపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అందుకే అన్ని జాగ్రత్తలు వైసీపీ నేతలు తీసుకోవాల్సి ఉంటుంది.

**ప్రత్యక్ష ఎన్నిక కావడంతో...**

ఎందుకంటే ఈసారి మేయర్, ఛైర్మన్ల ఎన్నిక నేరుగా జరుగుతుంది. ప్రత్యక్ష ఎన్నికల ద్వారా జరిగే ఎంపిక కావడంతో ఖచ్చితంగా ప్రలోభాలకు చివరి నిమిషం వరకూ గురిచేస్తారు. ఏకగ్రీవం చేసుకోవాలన్నది అధికార పార్టీ పట్టుదలగా ఉంటుంది. మరొకవైపు ఏకగ్రీవమయితే వచ్చే ఎన్నికల్లో సీటు కూడా దక్కదన్న జగన్ హెచ్చరికలు వైసీపీ నేతల చెవుల్లో మారుమోగిపోతున్నాయి. అందుకే ఒకచోట ఇద్దరు నుంచి ముగ్గురు నేతలను ఎంపిక చేసి వారిలో చివరకు ఒకరిని బరిలో ఉంచితే మేలని వైసీపీ నియోజకవర్గ ఇన్ ఛార్జులు భావిస్తున్నారు. కానీ పార్టీ అధికారంలో లేకపోవడంతో ముగ్గురు బలమైన నేతలు దొరకడం అంత సులువు కాదు. తమ జేబులో డబ్బులు పెట్టాలంటే మరింత ఇబ్బంది పడతామని భావిస్తున్నారు. అందుకే వైసీపీ నియోజకవర్గాల ఇన్ ఛార్జుల పరిస్థితి ఒకింత ఆందోళనలో ఉన్నారు. అభ్యర్థుల ఎంపిక పూర్తయి ఎన్నికలు ముగిసే వరకూ వారికి టెన్షన్ తప్పదు.

## తెలంగాణలో పెరిగిన క్రైమ్ రేట్.. ఆందోళనకరంగా ఆర్గనైజ్డ్ క్రైమ్, డ్రగ్స్ కేసులు

- మొదటి పేజి తరువాయి

46.10 శాతం పెరగడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. డీజీపీ సీవీ ఆనంద్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన అర్ధవార్షిక నేర సమీక్షా సమావేశంలో ఈ గణాంకాలను వెల్లడించారు. పోలీసు శాఖ విడుదల చేసిన వివరాల ప్రకారం, 2023-24లో 2,65,377గా నమోదైన మొత్తం కేసుల సంఖ్య, 2025-26 నాటికి 2,84,363కు చేరింది. ఇదే సమయంలో నార్కోటిక్స్ కేసులు 2,026 నుంచి 2,960కు పెరిగాయి. ఇక వ్యవస్థీకృత నేరాలు (ఆర్గనైజ్డ్ క్రైమ్) ఏకంగా 1,704 శాతం పెరుగుదలతో 25 నుంచి 451కి చేరడం గమనార్హం.కాగా, కొన్ని విభాగాల్లో నేరాలు గణనీయంగా తగ్గముఖం పట్టాయి. సైబర్ నేరాలు 13.29 శాతం, ఆర్థిక నేరాలు 13.28 శాతం తగ్గాయి. అలాగే హత్యలు, దోపిడీల వంటి తీవ్రమైన నేరాలు కూడా 10.33 శాతం మేర తగ్గాయి. ముఖ్యంగా హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఇటువంటి కేసులు నమోదు 26.23 శాతం తగ్గడం ఊరటనిచ్చే అంశం.మరోవైపు, చిన్నపాటి నేరాలు 7.28 శాతం పెరిగాయి. కొన్ని జిల్లాల్లో ఈ పెరుగుదల అధికంగా ఉంది. నార్కోటిక్స్ కేసుల పెరుగుదల పోలీసు శాఖకు పెద్ద సవాలుగా మారిందని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. కేవలం గణాంకాలకే పరిమితం కాకుండా, ప్రతి నేరం వెనుక ఉన్న కారణాలను లోతుగా విశ్లేషించాలని అధికారులను ఆదేశించారు. క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ (సీసీటీఎన్ఎస్) డేటా అప్‌డేట్ రేటు 96 శాతానికి చేరడంపై ఆయన సిబ్బందిని అభినందించారు. క్షేత్రస్థాయిలో పోలీసుల పనితీరులో వృత్తిపరమైన ప్రమాణాలు పాటించాలని, నేరాల కట్టడికి పటిష్ఠమైన ప్రణాళికలు రూపొందించాలని స్పష్టం చేశారు.

## ఒంగోలు సమీపంలో రాడిసన్ 5 స్టార్ హోటల్: శంకుస్థాపన చేసిన మంత్రి నారా లోకేశ్

- మొదటి పేజి తరువాయి

నిర్మించనున్న ప్రముఖ అంతర్జాతీయ బ్రాండ్ 'రాడిసన్' 5 స్టార్ హోటల్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ప్రసిద్ధ రవిశంకర్ గ్రూప్, రవిప్రియ హాస్పిటాలిటీస్ ఎల్ఎల్పీ సంస్థల సంయుక్త భాగస్వామ్యంలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ ప్రతిష్ఠాత్మక హోటల్ రూపుదిద్దుకోనుంది.ఒంగోలు ప్రాంతంలో ఏర్పాటు కాబోతున్న మొదటి అంతర్జాతీయ బ్రాండెడ్ 5 స్టార్ హోటల్ ఇదే కావడం విశేషం. 151 విలాసవంతమైన గదులు, మల్టీ-క్యూసిన్ రెస్టారెంట్లు, ప్రీమియం బార్, లాంజ్, స్విమ్మింగ్ పూల్, స్పా, ఫిట్‌నెస్ సెంటర్ వంటి అత్యాధునిక సదుపాయాలతో దీనిని తీర్చిదిద్దుతున్నారు. అంతేకాకుండా, బిజినెస్ టూరిజం విస్తరణకు అనుగుణంగా 2,100 చదరపు మీటర్లకు పైగా విశాలమైన స్థలంలో భారీ బ్యాంకెట్ హాళ్లు, కాన్ఫరెన్స్ రూమ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. జాతీయ రహదారి-16కి అత్యంత సమీపంలో రూపుదిద్దుకుంటున్న ఈ ప్రాజెక్ట్ వల్ల పారిశ్రామికవేత్తలు, వ్యాపార ప్రతినిధులు, పర్యాటకులకు మెరుగైన వసతులు అందుబాటులోకి రానున్నాయి.ఈ విలాసవంతమైన 5 స్టార్ హోటల్ రాకతో ఒంగోలు, దాని పరిసర ప్రాంతాల్లో హాస్పిటాలిటీ, టూరిజం, రవాణా, సేవా రంగాల్లో స్థానిక యువతకు పెద్ద ఎత్తున ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. శంకుస్థాపన కార్యక్రమం అనంతరం లోకేశ్ పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలతో ఆత్మీయంగా మమేకమయ్యారు. అభిమానులతో ఫొటోలు దిగుతూ, వారి నుంచి వినతులను స్వీకరించారు. రక్షా బంధన్ సందర్భంగా పలువురు మహిళా కార్యకర్తలు లోకేశ్‌కు రాఖీలు కట్టి తమ శుభాకాంక్షలు తెలియజేశారు.

# నియోజకవర్గాల విజన్ ప్లాన్..
# పనితీరుకు అదే ప్రామాణికం

- మొదటి పేజి తరువాయి

ధోరణి వీడి వినూత్నంగా ఆలోచించాలని, స్థానిక వనరులను సద్వినియోగం చేసుకుంటూ ఆయా నియోజకవర్గాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఇందుకోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'డేటా లేక్' లోని సమాచారాన్ని విశ్లేషించుకోవాలని, టెక్నాలజీని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ఆదేశించారు. ఉద్యోగుల సామర్థ్యం పెంచేందుకు ఇప్పటికే 1.50 కోట్ల ఆన్‌లైన్ కోర్సులు పూర్తి చేశారని తెలిపారు.ప్రభుత్వ లక్ష్యం కేవలం నగదు బదిలీ కాదని, లబ్ధిదారులను ఆర్థికంగా నిలబెట్టి వారిలో సాధికారత తీసుకురావడమేనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ౹ా4 ప్రాజెక్టు ద్వారా పేదలకు అవసరమైన చేయూత అందిస్తున్నామని, ప్రతి నియోజకవర్గంలో తలసరి ఆదాయం పెంచడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ ప్రతి పేద కుటుంబానికి అండగా ఉంటామనే భరోసా కల్పించాలన్నారు. జిల్లాలకు, నియోజకవర్గాలకు వస్తున్న పరిశ్రమలు క్షేత్రస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభిం చేలా (గ్రౌండింగ్) ప్రజాప్రతినిధులు, అధికారులు పూర్తిస్థాయిలో సహకరించాలని ఆదేశించారు.పేద, మధ్యతరగతి కుటుంబాలకు విద్య, వైద్యం భారంగా మారకుండా ఉండేందుకే 'తల్లికి వందనం', 'సంజీవని' వంటి పథకాలు తెచ్చామని సీఎం వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచడం వల్ల అదనంగా లక్ష మంది విద్యార్థులు చేరారని, ఇది వారి కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించిందని పేర్కొన్నారు. మెగా డీఎస్సీ ప్రక్రియకు అడ్డంకులు సృష్టించే ప్రయత్నాలు

జరిగినా, పారదర్శకంగా పూర్తి చేసి నిరుద్యోగ యువతకు న్యాయం చేశామని, దీనిపై విమర్శలు వస్తే టీచర్లే స్వయంగా ఉద్యమించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రజలను మెప్పించగలిగితే వారి నుంచి సహకారం కూడా అదే స్థాయిలో ఉంటుందని సీఎం ఉద్ఘాటించారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి పయ్యావుల కేశవ్, ఆర్థిక, ప్రణాళిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్ కుమార్, ఏపీఎస్‌డీపీఎస్ ఈడీ వీఆర్ అలవర్తి సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### కన్నీళ్లతో కర్ణాటక మంత్రి పదవికి నాగేంద్ర రాజీనామా..
## రెండేళ్లలో ఇది రెండోసారి!

కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. తీవ్ర వివాదాస్పదమైన మహర్షి వాల్మీకి గిరిజన అభివృద్ధి కార్పొరేషన్ కుంభకోణం ఆరోపణల నేపథ్యంలో, రాష్ట్ర మంత్రి బి. నాగేంద్ర శుక్రవారం సాయంత్రం తన పదవికి రాజీనామా చేశారు. విలేకరుల సమావేశంలో తన నిర్ణయాన్ని ప్రకటిస్తూ ఆయన తీవ్ర భావోద్వేగానికి లోనై కన్నీటిపర్యంతమయ్యారు. గత రెండేళ్ల కాలంలో ఇదే ఆరోపణలపై ఆయన రాజీనామా చేయడం ఇది రెండోసారి కావడం గమనార్హం.ఈ కుంభకోణం నేపథ్యాన్ని పరిశీలిస్తే, వాల్మీకి కార్పొరేషన్‌లో సుమారు రూ. 89 కోట్ల మేర నిధులు అక్రమంగా బదిలీ అయ్యాయని ఆరోపణలు వచ్చాయి. 2024 మే నెలలో కార్పొరేషన్ అకౌంట్స్ అధికారి చంద్రశేఖరన్ ఆత్మహత్య చేసుకుంటూ రాసిన లేఖతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీంతో అప్పటి సిద్ధరామయ్య ప్రభుత్వంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న నాగేంద్ర, 2024 జూన్‌లో తొలిసారి తన పదవికి రాజీనామా చేశారు. అయితే, డీకే శివకుమార్ ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన తర్వాత, 2026 ఆగస్టు 3న నాగేంద్రను తిరిగి మంత్రివర్గంలోకి తీసుకున్నారు. కానీ ప్రతిపక్ష బీజేపీ నుంచి తీవ్ర ఒత్తిడి ఎదురుకావడంతో ఆయన మరోసారి పదవిని వీడాల్సి వచ్చింది. ఈ సందర్భంగా

నాగేంద్ర మాట్లాడుతూ, రాజ్యాంగంపై తనకు పూర్తి నమ్మకం ఉందని, ఈ అంశంపై అసెంబ్లీలో చర్చకు తాము సిద్ధంగా ఉన్నా బీజేపీ ముందుకు రాలేదని విమర్శించారు. బీజేపీకి గిరిజన వ్యతిరేక మనస్తత్వం ఉందని, ఆ పార్టీ 'మనుస్మృతి'ని రుద్దాలని ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

మరోవైపు, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ సెప్టెంబర్ 1 నుంచి 10 వరకు రాయచూర్ నుంచి బళ్లారి వరకు పాదయాత్ర చేస్తామని బీజేపీ ఇప్పటికే ప్రకటించింది. ఈ యాత్రను కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ప్రారంభించనున్నారు.

### రేవంత్ రెడ్డికి రాఖీ కట్టిన కొండా సురేఖ..
### రాజకీయాలు మాట్లాడనని వ్యాఖ్య

తెలంగాణ రాజకీయాల్లో గత కొన్ని రోజులుగా తీవ్ర దుమారం రేపిన పరిణామాల మధ్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కొండా సురేఖల భేటీ పొలిటికల్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. పరకాల నియోజకవర్గ వివాదంలో కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ నేరుగా సీఎం రేవంత్‌పై చేసిన వ్యాఖ్యలు, ఆపై పీసీసీ క్రమశిక్షణా కమిటీ చర్యలకు సిద్ధమవ్వడం కాంగ్రెస్‌లో తీవ్ర కలకలం రేపిన సంగతి తెలిసిందే. కేబినెట్ నుంచి సురేఖపై వేటు పడుతుందనే ప్రచారం జరుగుతున్న తరుణంలో, రాఖీ పండుగను పురస్కరించుకుని ఆమె నేరుగా సీఎం నివాసానికి వెళ్లడం విశేషం.ఈ సందర్భంగా రేవంత్ రెడ్డితో పాటు ఆయన మనవడికి, అల్లుడికి కొండా సురేఖ ఎంతో ఆత్మీయంగా రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఈ పవిత్రమైన పండుగ రోజున ఎలాంటి రాజకీయాల గురించి మాట్లాడనని స్పష్టం చేశారు. తాను అందరికీ సోదరినని, రాష్ట్రంలోని ఆడబిడ్డల ఆశీస్సులు, అండదండలు సీఎం రేవంత్ రెడ్డికి ఎల్లవేళలా ఉంటాయని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని మరిన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లే శక్తిని, ఆయురారోగ్యాలను ఆయనకు ప్రసాదించాలని దేవుడిని కోరుకున్నట్లు సురేఖ తెలిపారు.

## నేపాల్‌లో జల ప్రళయం..
## 547కి చేరిన మృతుల సంఖ్య

- మొదటి పేజి తరువాయి

మంది ఇప్పటికీ గల్లంతయ్యారని, వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. భోటేకోషి నదిలో నీటిమట్టం ప్రమాదకర స్థాయిలో పెరుగుతుండటంతో మళ్లీ వరదలు వచ్చే ప్రమాదం ఉందని, ఈ కారణంగా సహాయక బృందాలు అత్యంత జాగ్రత్తగా ముందుకు సాగుతున్నాయి.రసువా జిల్లాలో వరదల నుంచి ప్రాణాలతో బయటపడిన కస్టమ్స్ ఏజెంట్ రాజు బుధతోకి మాట్లాడుతూ, "భూమి ఒక్కసారిగా కంపించినట్లు అనిపించింది. కళ్ళు తెరిచేలోపే వరద నీరు ఉవ్వెత్తున ఎగిసిపడి ఇళ్లను తుడిచిపెట్టేసింది. ఈ ప్రమాదం నుంచి బయటపడటం నాకు పునర్జన్మ లాంటిది" అని ఆ భయానక క్షణాలను గుర్తుచేసుకున్నారు.ఈ విపత్తు ప్రభావం చైనా వైపున ఉన్న టిబెట్‌పైనా తీవ్రంగా పడింది. నేపాల్ సరిహద్దులోని పోర్టు వద్ద సంభవించిన వరదల్లో ఐదుగురు మరణించగా, 260 మంది విదేశీయులతో సహా 558 మంది గల్లంతయ్యారని చైనా అధికారులు ప్రకటించారు. ఈ ఘటనపై చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కమ్యూనిస్ట్ పార్టీ అత్యవసర సమావేశం నిర్వహించి సహాయక చర్యలపై సమీక్షించారు. నేపాల్‌లోని ఎత్తైన హిమానీనదం (గ్లేసియర్) ఒకటి కూలిపోవడం వల్లే ఈ విపత్తు సంభవించి ఉండవచ్చని చైనా ప్రాథమికంగా అంచనా వేస్తోంది. ఖాట్మండులోని శాస్త్రవేత్తలు కూడా ఇదే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. హిమానీనదం కూలిపోవడం, మంచు-రాళ్ల చరియలు విరిగిపడటంతో లెండే నదికి తాత్కాలికంగా ఆనకట్టలా అడ్డుపడిందని, అది ఒక్కసారిగా తెగిపోవడంతో, అక్కడ్నించి భోటేకోషి నదిలోకి ఈ స్థాయిలో వరద ప్రవాహం దూసుకొచ్చిందని భావిస్తున్నారు.

ఈ పెను విషాదంపై అంతర్జాతీయ సమాజం స్పందిస్తోంది. నేపాల్ ప్రధాని బాలేంద్ర షా, ఆయన కేబినెట్ మంత్రులు తమ ఒక నెల జీతాన్ని విపత్తు సహాయ నిధికి విరాళంగా ప్రకటించారు. ఖాట్మండులోని మహాకాళ్ శని భగవాన్ ఆలయంలో బాధితుల ఆత్మశాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వరదల్లో చిక్కుకున్న భారత పర్యాటకులను భారత రాయబారి నవీన్ శ్రీవాస్తవ కలిసి ధైర్యం చెప్పారు. యునైటెడ్ కింగ్‌డమ్ 5 మిలియన్ పౌండ్ల ఆర్థిక సహాయంతో పాటు, అత్యవసర సహాయక బృందాలను పంపడానికి ముందుకొచ్చింది. గల్లంతైన వారిలో సుమారు 33 మంది బ్రిటిష్ పౌరులు ఉన్నట్లు సమాచారం. సరిహద్దుల్లో అంతర్జాతీయ సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

### రాఖీ పండుగకు టీజీఎస్ఆర్టీసీ
## ఛార్జీల బాదుడు

రాఖీ పౌర్ణమి వేళ ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినప్పటికీ, టికెట్ ధరలను భారీగా పెంచడంపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. పండుగ పూట తమ స్వగ్రామాలకు వెళ్లే సామాన్య ప్రయాణికులకు ఈ అదనపు ఛార్జీల బాదుడు భారంగా మారింది.రాఖీ పండుగను పురస్కరించుకుని ఆగస్టు 27 నుంచి 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 5,000 ప్రత్యేక బస్సులను నడపాలని టీజీఎస్ఆర్టీసీ నిర్ణయించింది. అయితే, ఈ బస్సుల్లో సాధారణ ఛార్జీల కంటే 50 శాతం అదనంగా వసూలు చేస్తున్నారు. ఉదాహరణకు, మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్) నుంచి జడ్చర్లకు సాధారణ ఛార్జీ రూ. 150 ఉండగా, ప్రత్యేక బస్సుల్లో దానిని రూ. 190కి పెంచారు. అదేవిధంగా, కరీంనగర్‌కు వెళ్లే సూపర్ డీలక్స్ బస్సులో సాధారణ టికెట్ ధర రూ. 300 ఉండగా, ప్రస్తుతం రూ. 400 వసూలు చేస్తున్నారు. ఛార్జీల పెంపుపై ముందస్తు సమాచారం లేకపోవడంతో బస్సు ఎక్కిన తర్వాత తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ధరల పెంపుపై ముందే ప్రకటన విడుదల చేస్తే బాగుండేదని పలువురు ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు. ఈ అంశంపై టీజీఎస్ఆర్టీసీ పీఆర్వో ప్రసన్న స్పందిస్తూ వివరణ ఇచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హయాంలో 1981లో వెలువడిన ప్రభుత్వ ఉత్తర్వుల (జీవో) ప్రకారం, పండుగ సమయాల్లో నడిపే ప్రత్యేక బస్సుల్లో సాధారణ ధర కంటే 1.5 రెట్లు అధికంగా వసూలు చేసే వెసులుబాటు సంస్థకు ఉందని ఆమె స్పష్టం చేశారు.

## పచ్చదనం సంకల్పాన్ని నాగబాబు సమర్థంగా నెరవేర్చాలి

- మొదటి పేజి తరువాయి

రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పచ్చదనంతో కళకళలాడే ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించాలనే ఆశయంతో కూటమి ప్రభుత్వం ఈ ప్రత్యేక నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసిందని, ప్రకృతిపై ఎంతో ప్రేమ ఉన్న నాగబాబు ఈ బృహత్తర బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. 2047 నాటికి రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో పచ్చదనాన్ని ఏకంగా 50 శాతానికి పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, ఈ భారీ ప్రాజెక్టును నాగబాబు ముందుకు తీసుకెళతారని పవన్ పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణను కేవలం ఒక ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ఒక ప్రజా ఉద్యమంగా మలిచే బాధ్యతలో ఆయన పూర్తి విజయం సాధించాలని ఆకాంక్షించారు.

మరోవైపు, నాగబాబుకు కేబినెట్ హోదా కల్పిస్తూ ఏపీ గ్రీన్ కమిటీ ఛైర్మన్‌గా నియమించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకి, అందుకు మద్దతు తెలిపిన కూటమి భాగస్వామ్య పక్షాల నాయకులకు పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## పదోసారి సవాల్ చేస్తున్నా.. డేట్-టైమ్-ప్లేస్ ఫిక్స్ చెయ్ జగన్.. చర్చకు నేను రెడీ

**డీఎస్సీ, వెలిగొండపై ఘాటు విమర్శలు**

గత ప్రభుత్వంలో డీఎస్సీపై 150 కేసులు వేయించినా, తాము విజయవంతంగా పూర్తిచేసి ఉద్యోగాలు ఇచ్చామని లోకేశ్ గుర్తుచేశారు. "అది మా చిత్తశుద్ధి. మీరు నిర్వహించిన గ్రూప్-1 అవకతవకలపై కోర్టు పర్యవేక్షణలో విచారణ జరుగుతోంది. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని న్యాయస్థానమే చెప్పింది. ఈ ఏడాది మాత్రమే కాదు, రాబోయే మూడేళ్లు కూడా డీఎస్సీ నిర్వహిస్తాం. జగన్ వాళ్ల తాత వచ్చినా మమ్మల్ని అడ్డుకోలేరు" అని స్పష్టం చేశారు.

వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసింది చంద్రబాబేనని, త్వరలో పూర్తి చేసి ప్రారంభించేది కూడా చంద్రబాబేనని అన్నారు. పనులు పూర్తి చేయకుండానే జాతికి అంకితం చేశారని, ఇప్పుడు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇచ్చి పనులు పూర్తి చేస్తుంటే క్రెడిట్ చోరీ అంటున్నారని మండిపడ్డారు.

**స్థానిక ఎన్నికల్లోనూ గెలుపే లక్ష్యం**

త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని లోకేశ్ పిలుపునిచ్చారు. "అందరం కలిసికట్టుగా పనిచేస్తే సార్వత్రిక ఎన్నికల కంటే 2 శాతం అదనపు ఓట్లతో ఘన విజయం సాధిస్తాం. కార్యకర్తలు నా చుట్టూ కాదు, ప్రజల చుట్టూ తిరగండి. పదవులు ఇచ్చే బాధ్యత నాది" అని భరోసా ఇచ్చారు. మై టీడీపీ యాప్ ద్వారా 4 లక్షల మంది నాయకులను పర్యవేక్షిస్తున్నామని, పార్టీ కార్యక్రమాలను సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. ఒంగోలు పోతురాజు కాల్వ, నల్లకాలువల అభివృద్ధికి వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయించే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. అహంకారంతో వ్యవహరిస్తే ప్రజలకు దూరం అవుతామని హితవు పలికారు.

**మరో మూడుసార్లు గెలవాలి**

రాష్ట్రాన్ని పూర్తిగా గాడిలో పెట్టాలంటే కనీసం మరో మూడుసార్లు వరుసగా టీడీపీ కూటమి గెలవాల్సిన అవసరం ఉందని లోకేశ్ అభిప్రాయపడ్డారు. "గత ఎన్నికల్లో జనసేన, బీజేపీలతో కలిసి 94 శాతం సీట్లు గెలిచాం. మన ఐక్యత ఇలాగే కొనసాగాలి. సోషల్ మీడియాలో ఒకరిపై ఒకరు పోస్టులు పెట్టుకుంటే రాష్ట్రమే నష్టపోతుంది" అని అన్నారు.

తనపై గత ప్రభుత్వం 23 తప్పుడు కేసులు పెట్టిందని, వాటిలో అటెంప్ట్ మర్డర్, ఎస్సీ, ఎస్టీ కేసులు కూడా ఉన్నాయని గుర్తుచేశారు. తాను జగన్‌లా కంచుకోటలో పోటీ చేయలేదని, 40 ఏళ్లలో గెలవని మంగళగిరిలో 91 వేల మెజారిటీతో గెలవడం తన సత్తా అని అన్నారు.

**జగన్ తప్పులకు వైసీపీ నేతల బలి**

జగన్ చేసిన తప్పుడు పనుల వల్లే కొందరు వైసీపీ నాయకులు ఈరోజు జైళ్లకు వెళుతున్నారని, ఇప్పుడు వారంతా కులం కార్డు వాడుతున్నారని లోకేశ్ ఆరోపించారు. బీసీలకు 10 శాతం రిజర్వేషన్లు తగ్గించి 17 వేల మందికి పదవులు రాకుండా అడ్డుకున్నారని విమర్శించారు. అమర్‌నాథ్ గౌడ్, నందం సుబ్బయ్య, తోట చంద్రయ్య హత్యలను ప్రస్తావిస్తూ వైసీపీ పాలనలో అరాచకాలు పెరిగాయన్నారు. మాజీ మంత్రులు సీదిరి అప్పలరాజు, కారుమూరి నాగేశ్వరరావుల ఉదంతాలను ఉటంకిస్తూ.. వారు చేసిన తప్పుల వల్లే చట్టపరమైన చిక్కుల్లో పడ్డారని, దీనికి ప్రభుత్వానికి సంబంధం లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, పలువురు టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రాష్ట్రం ప్రస్తుతం కఠిన పరిస్థితుల్లో ఉందని, రూపాయి ఆదాయంలో 94 పైసలు జీతాలకే పోతోందని, అయినా చంద్రబాబు రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా నిలపడానికి అహర్నిశలు శ్రమిస్తున్నారని లోకేశ్ తెలిపారు.

## గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన నాగబాబు

- మొదటి పేజి తరువాయి

కలిసి పాల్గొన్న ఆయన... వేదపండితుల మంత్రోచ్చారణలు, ప్రత్యేక పూజల నడుమ పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం వేదపండితులు ఆయనకు వేదాశీర్వచనం అందించారు.రాష్ట్ర పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఏపీ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న 'ఏపీ గ్రీన్' ప్రాజెక్టును ముందుకు నడిపేందుకు నాగబాబుకు ఈ కీలక బాధ్యతలను అప్పగించారు. 2047 నాటికి రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో అటవీ, పచ్చదనం శాతాన్ని ఏకంగా 50 శాతానికి పెంచాలనే భారీ లక్ష్యంతో ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌ను వేగవంతం చేసేందుకు గాను నాగబాబుకు కేబినెట్ హోదా హోదాతో కూడిన బాధ్యతలను అప్పగించింది.బాధ్యతలు స్వీకరించిన అనంతరం నాగబాబును పలువురు ఐఏఎస్ అధికారులు, అటవీ శాఖ సీనియర్ అధికారులు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు మర్యాదపూర్వకంగా కలిశారు. పీసీసీఎఫ్ చలపతిరావు, పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజలతో పాటు ఇతర ప్రభుత్వ సలహాదారులు, ప్రముఖులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# ఆడపడుచులకు అన్నగా.. అండగా ఉంటా




మంత్రి సుభాష్

**రామచంద్రపురం, పెన్ పవర్,ఆగస్టు 28:** రామచంద్రపురం టౌన్‌హాల్లో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో "అన్నయ్యతో ఒకరోజు" పేరుతో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని వేలాది మంది మహిళలు తరలివచ్చి మంత్రికి రాఖీలు కట్టి తమ ఆత్మీయతను చాటుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి ఆడపడుచుకు అన్నగా అండగా ఉంటానని, వారి కష్టసుఖాల్లో తోడుగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. రామచంద్రపురం నియోజకవర్గ అభివృద్ధికి గత రెండేళ్లలో రూ.250 కోట్లు తీసుకొచ్చామని, కోటిపల్లి--ముక్తేశ్వరం బ్రిడ్జి నిర్మాణం సాధించి నియోజకవర్గ రూపురేఖలు మారుస్తానని తెలిపారు. మహిళా సంక్షేమం, ఆర్థిక స్వావలంబనకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సమస్యలకు భయపడి ఆత్మహత్యలకు పాల్పడవద్దని, ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని సూచించారు. రామచంద్రపురమే తన శాశ్వత చిరునామా అని, తాను అమలాపురం వెళ్తానంటూ జరుగుతున్న ప్రచారం అవాస్తవమని స్పష్టం చేశారు. అనంతరం మహిళలతో కలిసి ప్రేమ విందులో పాల్గొని, ఆటలు, పాటలు, అంత్యాక్షరి, టగ్‌ఆఫ్‌వార్, కుర్చీలాట తదితర పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వాసంశెట్టి సత్యం, జాస్తి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

## జనసేన నేత మేడిశెట్టి బాబీకి రాఖీ కట్టిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ....





### నియోజవర్గ ప్రజలకు ఎమ్మెల్యే సత్యప్రభ, మేడిశెట్టి బాబీ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు..

**శంఖవరం పెన్ పవర్ ఆగష్టు 28:**-రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడి టీడీపీ కార్యాలయంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ.. జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, ప్రత్తిపాడు నియోజకవర్గ జనసేన సమన్వయకర్త మేడిశెట్టి బాబీకి రాఖీ కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి బాబీ నియోజకవర్గ ప్రజలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను ప్రజలంతా సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

# భక్తిభావంతో వెల్లివిరిసిన శ్రావణ శుక్రవారం వేడుకలు









- ర్యాలి జగన్మోహిని కేశవ స్వామివారి ఆలయంలో వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు
- భక్తులతో కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం.. ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

**పెన్ పవర్ ఆత్రేయపురం, ఆగస్టు 28:**శ్రావణ మాసం అంటేనే ఆధ్యాత్మికతకు, భక్తిభావానికి, సంప్రదాయాలకు ప్రతీక. అందులోనూ శ్రావణ శుక్రవారం సందర్భంగా నిర్వహించే వరలక్ష్మీ వ్రతానికి మహిళల జీవితాల్లో ప్రత్యేక స్థానం ఉంది. సౌభాగ్యం, సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, కుటుంబ శ్రేయస్సు కలగాలని ఆకాంక్షిస్తూ మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఈ పవిత్ర వేడుకలు ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలోని శ్రీ జగన్మోహిని కేశవ స్వామివారి ఆలయంలో వైభవంగా జరిగాయి.

శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయ ప్రాంగణం తెల్లవారుజాము నుంచే భక్తులతో కళకళలాడింది. సంప్రదాయ దుస్తుల్లో పెద్ద సంఖ్యలో మహిళలు ఆలయానికి తరలివచ్చి సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో పాల్గొన్నారు. ఆలయ వాతావరణమంతా భక్తి గీతాలు, మంత్రోచ్చారణలు, పూజా కార్యక్రమాలతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. మహిళలు వరలక్ష్మీ అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలుస్తూ తమ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని, సర్వమంగళాలు చేకూరాలని ప్రార్థించారు.

**స్వామివారి దర్శనం చేసుకున్న ఎమ్మెల్యే**

ఈ పవిత్ర కార్యక్రమానికి కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు హాజరై శ్రీ జగన్మోహిని కేశవ స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు అర్చకులు, ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు.

స్వామివారి సన్నిధిలో పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ప్రశాంత జీవనం సాగించాలని ఆకాంక్షించారు. ప్రజల జీవితాల్లో శాంతి, సౌభాగ్యం, అభివృద్ధి నెలకొనాలని స్వామివారిని ప్రార్థించారు.

**మహిళలకు పసుపు, కుంకుమ అందజేత**

అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న సామూహిక వరలక్ష్మీ వ్రత కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. వ్రతాలు ఆచరిస్తున్న మహిళల వద్దకు వెళ్లి వారిని పలకరించారు. మహిళలకు పసుపు, కుంకుమలను అందజేసి వరలక్ష్మీ అమ్మవారి ఆశీస్సులు ప్రతి కుటుంబంపైనా ఉండాలని ఆకాంక్షించారు.

శ్రావణ మాసంలో మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించే వరలక్ష్మీ వ్రతం కుటుంబ శ్రేయస్సుకు, సౌభాగ్యానికి ప్రతీకగా నిలుస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించడంలో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా వ్రతం నిర్వహిస్తున్న మహిళలందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

**భక్తులతో సందడిగా ఆలయ ప్రాంగణం**

శ్రావణ శుక్రవారం సందర్భంగా ర్యాలి గ్రామంలోని శ్రీ జగన్మోహిని కేశవ స్వామివారి ఆలయానికి పరిసర ప్రాంతాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మహిళలు సంప్రదాయబద్ధంగా పూజా సామగ్రితో ఆలయానికి చేరుకుని వరలక్ష్మీ అమ్మవారిని కొలిచారు. పూజా కార్యక్రమాలు పూర్తయ్యే వరకు ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో గడిపారు.

వ్రత కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు తమ కుటుంబాల్లో సుఖశాంతులు, సౌభాగ్యం, సంపద, ఆయురారోగ్యాలు సమృద్ధిగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. ఆలయ ప్రాంగణం మొత్తం భక్తుల సందడితో పండుగ వాతావరణాన్ని తలపించింది.

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేశారు. వ్రత కార్యక్రమానికి వచ్చే మహిళలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించారు. పూజా కార్యక్రమాలు సజావుగా జరిగేలా ఆలయ సిబ్బంది, అర్చకులు సమన్వయంతో వ్యవహరించారు.

**సంప్రదాయాల పరిరక్షణకు సామూహిక కార్యక్రమాలు దోహదం**

ఆధునిక జీవన విధానంలోనూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలను నిలబెట్టడంలో దేవాలయాల్లో నిర్వహించే సామూహిక పూజా కార్యక్రమాలు కీలకంగా నిలుస్తున్నాయి. వ్యక్తిగతంగా నిర్వహించే వ్రతాలకు భిన్నంగా సామూహికంగా నిర్వహించే కార్యక్రమాలు భక్తుల్లో ఐక్యతా భావాన్ని పెంపొందించడంతో పాటు ఆధ్యాత్మిక చైతన్యాన్ని తీసుకొస్తున్నాయి.

ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ స్వామివారి ఆలయంలో నిర్వహించిన సామూహిక వరలక్ష్మీ వ్రతం కూడా ఇదే తరహాలో భక్తులను ఒక్కతాటిపైకి తీసుకువచ్చింది. ఒకే ప్రాంగణంలో పెద్ద సంఖ్యలో మహిళలు కలిసి పూజలు నిర్వహించడం, సంప్రదాయ పద్ధతిలో వ్రతాన్ని ఆచరించడం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

**ఘనంగా పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు**ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ధర్మకర్త మండలి సభ్యులు, ఆలయ కార్యనిర్వహణాధికారి ద్వారపురెడ్డి సురేష్ బాబు, మండల టీడీపీ అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు, ప్రధాన కార్యదర్శి గుడేల నాగేంద్ర గౌడ్, ర్యాలి గ్రామ పెద్దలు పేర్చర్ల పల్లంరాజు వర్మ, మద్దూరు సుబ్బారావు, కూటమి నాయకులు, ఆలయ జూనియర్ అసిస్టెంట్లు, అర్చకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శ్రావణ శుక్రవారం సందర్భంగా జరిగిన సామూహిక వరలక్ష్మీ వ్రతాలు భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీకగా నిలిచాయి. అనంతరం పూజా కార్యక్రమం పాల్గొన్న మహిళ భక్తురాలకు స్వామివారి అన్న ప్రసాదం అందించారు.స్వామివారి దర్శనం, వరలక్ష్మీ అమ్మవారి పూజలు, మహిళల సామూహిక వ్రతాలతో ర్యాలి ఆలయ ప్రాంగణం భక్తి పరవశంలో మునిగిపోయింది. భక్తులు ఆనందోత్సాహాలతో పూజల్లో పాల్గొని స్వామివారి, అమ్మవారి కృపాకటాక్షాలు తమ కుటుంబాలపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు.



01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసిన జనసేన అభ్యర్థులకు అరుదైన గౌరవం

**పెద్దాపురం.. పెన్ పవర్.. ఆగస్టు. 28.**

పెద్దాపురం నియోజకవర్గ జనసేన పార్టీ అభ్యర్థులకు రాష్ట్ర స్థాయిలో ఘన సత్కారం

2021లో పోరాడిన వారిని గుర్తించి... నేడు గౌరవించిన జనసేన

మంగళగిరి : 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ పార్టీని ఎదుర్కొంటూ జనసేన పార్టీ తరఫున ధైర్యంగా పోటీ చేసిన అభ్యర్థులకు అరుదైన గౌరవం లభించింది. పార్టీ అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ గారి ఆదేశాల మేరకు విజయవాడ--మంగళగిరి కేంద్రంగా నిర్వహించిన జనసేన స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధత ఆత్మీయ సమావేశంలో ఈ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.

కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, డీసీసీబీ చైర్మన్ శ్రీ తుమ్మల రామస్వామి బాబు గారి ఆధ్వర్యంలో, పెద్దాపురం నియోజకవర్గానికి చెందిన 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసిన జనసేన పార్టీ సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, వార్డు కౌన్సిలర్ అభ్యర్థులను ప్రత్యేకంగా గుర్తించి గౌరవించారు.

పార్టీ కష్టకాలంలో కూడా అధికార వైసీపీని ఎదుర్కొని, ప్రజా సమస్యలను ముందుకు తీసుకెళ్లేందుకు ఎన్నికల బరిలో నిలిచిన ప్రతి అభ్యర్థి చేసిన పోరాటాన్ని జనసేన పార్టీ గుర్తించింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి, జనసేన పార్టీ పీఏసీ చైర్మన్ శ్రీ నాదెండ్ల మనోహర్ గారి చేతుల మీదుగా పెద్దాపురం నియోజకవర్గ అభ్యర్థులకు ఘన సత్కారం అందించారు.



రాష్ట్రవ్యాప్తంగా 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో తెగువ చూపించి పోటీలో నిలిచిన సుమారు 1000 మంది జనసేన పార్టీ అభ్యర్థులను ఈ కార్యక్రమంలో సత్కరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.


స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులను ముందుగా సత్కరించి, వారి త్యాగాన్ని, పోరాట స్ఫూర్తిని గుర్తించి కార్యక్రమాన్ని ప్రారంభించడం జనసేన పార్టీ ప్రత్యేకతకు నిదర్శనమని నాయకులు తెలిపారు.

పార్టీ కోసం కష్టకాలంలో నిలబడిన ప్రతి కార్యకర్త, ప్రతి అభ్యర్థి తమ కుటుంబ సభ్యులేనని జనసేన పార్టీ భావిస్తుందని, వారికి తగిన గౌరవం కల్పించడమే పార్టీ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సత్కారం భవిష్యత్తులో స్థానిక సంస్థల ఎన్నికల్లో మరింత ఉత్సాహంతో పనిచేసేందుకు అభ్యర్థులు, కార్యకర్తలకు కొత్త స్ఫూర్తిని అందిస్తుందని తెలిపారు.

# విద్యుత్ అమరవీరుల స్ఫూర్తి ని కొనసాగిదాం

**పెద్దాపురం... పెన్ పవర్.. ఆగస్టు 28..**2000 ఆగస్టు 28 న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ప్రజలపై విద్యుత్ చార్జీల భారాలకు, ప్రపంచ బ్యాంకు సంస్కరణలకు వ్యతిరేకంగా హైదరాబాద్ బషీర్ బాగ్ లో జరిగిన మహత్తర విద్యుత్ పోరాటంలో అమరులైన రామకృష్ణ, విష్ణువర్ధన్, బాలస్వామి సిపిఎం ఆధ్వర్యంలో పెద్దాపురం యాసలపు సూర్యారావు భవనం లో నివాళి అర్పించడం జరిగింది.సిపిఎం నాయకులు సిరిపురపు శ్రీనివాస్, చింతల సత్యనారాయణ అమరవీరుల చిత్రపటలకు పూలమాల వేసి నివాళి అర్పించారు.ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి క్రాంతి కుమార్ మాట్లాడుతూ ప్రపంచబ్యాంకు ఆదేశాలను అమలు చేయాలని ప్రయత్నించ్చిన నాటి చంద్రబాబు ప్రభుత్వం ప్రజా ప్రతీఘటన ఎదుర్కోవాల్సి వచ్చింది అన్నారు. రాక్షసంగా నాటి చంద్రబాబు ప్రభుత్వం ముగ్గురు ప్రాణాలు బలితీసుకుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రకరకాల పేర్లతో ప్రజలపై వేస్తున్న విద్యుత్ చార్జీల భారాలు రద్దు చేయాలని డిమాండ్ చేసారు. అదానీ కి లాభాలు పండిస్తూ, ప్రజలపై భారాలు వేసే ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసారు.ఈ కార్యక్రమం లో సిపిఎం నాయకులు డి సత్యనారాయణ, అప్పన్న, నరసింహామూర్తి, కూనిరెడ్డి అరుణ, రొంగల సుబలక్ష్మి, గునురి రమణ, చల్లా విశ్వనాధం, యాసలపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.




## శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాలలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం










**పెద్దాపురం.. పెన్ పవర్... ఆగస్టు.. 28..** పెద్దాపురం రామారావుపేటలో గల శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాలలో వ్యవహారిక భాషా ఉద్యమ నాయకుడు అయిన గిడుగు వేంకట రామమూర్తి గారి జయంతి సందర్భంగా జరుపుకునే మాతృ భాషాదినోత్సవ వేడుకలు చాలా ఘనంగా జరిగాయి.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సాహితీవేత్త, సీనియర్ జర్నలిస్ట్, ధాత్రి టీవి అధినేత అయిన శ్రీ పమిడి కాల్వ మధుసూదన్ గారు విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ మాతృమూర్తి పై, ఎంత ప్రేమను చూపిస్తామో మాతృ భాష పై కూండా అంత ప్రేమను చూపించాలి అని, తెలుగు భాష అజంత భాష కావడం వలన ప్రతీ పదాన్ని స్పష్టంగా పలికే వీలు వుంటుందని, ఏ యాస అయినా తెలుగు భాషలో కలిసిపోతుందని యతి ప్రాసలు, అలంకారాలు ఈ భాషకు జీవగఱ్ఱ కాబట్టే తెలుగు భాష సొగసు, మాధుర్యం ఇంతింత అని చెప్పలేం అని చెబుతూ శ్రీ ప్రకాష్ విద్యాసంస్థలు తెలుగుభాషకు పెద్ద పీట వేస్తూ తెలుగును బ్రతికిస్తున్నాయని ప్రశంసించారు.

పాఠశాల అకడమిక్ కోఆర్డినేటర్ శ్రీమతి యమ్. ప్రశాంతి గారు మాట్లాడుతూ భాషను నేర్చుకోవడం చాలా కష్టమని, కమ్మనైన అమ్మభాష అయిన తెలుగు భాషను రక్షించుకోవలసిన బాధ్యత మన అందరిది అని పేర్కొన్నారు.

పాఠశాల సీనియర్ ప్రిన్సిపాల్ శ్రీ యమ్.వి.వి.యస్.మూర్తి గారు మాట్లాడుతూ అందరూ తెలుగు భాష సులభం అనుకుంటారని, కాని తెలుగు భాషలో ఎంతో పద సంపద వుందని, సామెతలు, జాతీయాలు ఇలా మరెన్నో ప్రక్రియలు వున్నాయని విద్యార్థులు ప్రతీరోజూ ఒక కొత్తపదం, వారానికి ఒక పద్యం నేర్చుకోవాలని అప్పుడు తెలుగు భాష అజరామరంగా వుంటుందని అన్నారు.

పాఠశాల డైరెక్టర్ శ్రీ సిహెచ్. విజయ ప్రకాష్ గారు మాట్లాడుతూ తెలుగు భాష లో ఎన్నో మంచి మంచి పుస్తకాలు, మరెన్నో నీతి శతకాలు వున్నాయని వాటిని విద్యార్థులు వీలు దొరికినప్పుడు చదువుతూ వుండాలని, కనీసం తెలుగు వార్తాపత్రిక అయినా తరచుగా చదువుతూ వుండాలని అప్పుడే భాష వస్తుందని అక్షరాలను స్పష్టంగా అర్థ చేసుకుంటూ పలకాలి అని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో శ్రీ ప్రకాష్ సినర్జీ విద్యార్థులు తరగతుల వారిగా ప్రదర్శించిన వర్ణమాల మరియు తిథుల గేయం, నర్తించిన నృత్యం, గేయం మరియు శ్రీ శ్రీ ఖండికలు అందరినీ ఆకట్టుకున్నాయి.

తదనాంతరం పాఠశాలలో తరగతుల వారీగా నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతి ప్రధానం చేయబడింది.

ఈ కార్యక్రమంలో పాఠశాల అకడమిక్ కో ఆర్డినేటర్ శ్రీమతి ప్రశాంతి, కల్చరల్ కో ఆర్డినేటర్ శ్రీమతి ఉషా చైతన్య, పెద్దాపురం, సామర్లకోట, కాకినాడ ప్రాంతాలకు చెందిన సాహితీవేత్తలు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్థానికులు ఎన్నికల్లో బిజెపి ఢంకా మోగించాలి బీజేపీ నాయకురాలు హైమ

**సామర్లకోట. పెన్ పవర్.. ఆగస్టు. 28.**సామర్లకోట మండలం మేడపాడు గ్రామంలో ప్రతి ఒక్కరూ బీజేపీ స్థానిక ఎన్నికలు గెలిపించాలని
మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అభివృద్ధిలో భాగంగా చేస్తున్న అభివృద్ధి పనులు
మోదీ నాయకత్వంలో ప్రజలు అందరు సంతోషంగా ఉన్నారని
రాబోయే రోజుల్లో దేశంలో బిజెపి విస్తరిస్తుందని
రాబోయే స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం విజయడంకా మోగించాలని
ఆమె అన్నారు
కేవలం కేంద్రలో బీజేపీ నాయకత్వంలోనే అభివృద్ధి చెందుతుందని
మోదీ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాల వల్ల అన్ని రాష్ట్రాలు మోదీ వైపు చూస్తున్నారని
రాబోయే ఎన్నికల్లో కూడా బిజెపి విజయ ధంకా



మోగిస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు


## అన్నవరంలో సెప్టెంబర్ 4న ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు.



-సత్యదీక్ష ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణబాబు

**కిర్లంపూడి,పెన్ పవర్, ఆగస్టు 28:**అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో సెప్టెంబర్ 4వ తేదీ శుక్రవారం ఉదయం 7 గంటలకు ఉచిత సామూహిక వరలక్ష్మీ దేవి వ్రతాలు నిర్వహించనున్నట్లు సత్యదీక్ష ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణబాబు తెలిపారు.దేవస్థానం ఈవో నల్లం సూర్యచక్రధర్‌రావు,చైర్మన్ ఐవీ రోహిత్ ఆదేశాల మేరకు మహిళా భక్తుల కోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా మహిళా భక్తులు వరలక్ష్మీదేవి వ్రతాన్ని ఉచితంగా ఆచరించేందుకు దేవస్థానం అవకాశం కల్పిస్తున్నట్లు కృష్ణబాబు తెలిపారు.వ్రతంలో పాల్గొనే మహిళా భక్తులు కొబ్బరికాయలు,అరటిపండ్లు,విడిపూలు మాత్రమే తీసుకురావాలని, మిగిలిన పూజా సామగ్రిని దేవస్థానం ఉచితంగా సమకూర్చుతుందని పేర్కొన్నారు.వ్రతం అనంతరం శ్రీ సత్యనారాయణ స్వామివారు,అమ్మవారు,శ్రీ సీతారామచంద్ర స్వామివారు,వనదుర్గమ్మ తల్లిని దర్శించుకుని స్వామివారి, అమ్మవారి ఆశీస్సులు పొందాలని మహిళా భక్తులకు సూచించారు.అనంతరం దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం,అన్నప్రసాదం స్వీకరించే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు.వరలక్ష్మీ వ్రతంలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి,అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కృష్ణబాబు కోరారు.ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని కిర్లంపూడి మండలం
వేలంక,చిల్లంగి,జగపతినగరం,బూరుగుపూడి తదితర పరిసర ప్రాంతాల భక్తులకు కృష్ణబాబు తెలిపారు.ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు విజయలక్ష్మి,శ్యామల,వెంకటలక్ష్మి,గనిలక్ష్మి,భారతి, స్వాతి,వీరమణి తదితరులు పాల్గొన్నారు.

## రైతు ఉద్యమ నాయకులు సారాంపల్లి మల్లారెడ్డికి నివాళి




**పెద్దాపురం.. పెన్ పవర్.. ఆగస్టు 28.**

వ్యవసాయరంగం మీద సమగ్ర అవగాహనతో సాగునీరు, పంటలు, రైతు ఉద్యమాలు నిర్వహించిన నాయకుడు సారాంపల్లి మల్లారెడ్డి అని సీనియర్ జర్నలిస్ట్ చల్లా విశ్వనాథం అన్నారు.

సిపిఎం పెద్దాపురం మండల కమిటీ ఆధ్వర్యంలో రైతు సంఘం నాయకులు మల్లారెడ్డి, ఐద్వా రాష్ట్ర నాయకులు సుమతి మృతికి నివాళి అర్పించారు.

వారి చిత్ర పటాలకు నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు.

ఈ సందర్భంగా విశ్వనాథం మాట్లాడుతూ నిరంతరం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడే వారు ప్రజల్లో నీలేచే ఉంటారని అన్నారు. రైతు సమస్యలపై నిరంతరం అధ్యాయనం చేసి, అనేక పోరాటాలు రూపాకల్పన చేసారని అన్నారు.

ఐద్వా నాయకురాలిగా పనిచేసిన సుమతి రాష్ట్రం లో మహిళల సమస్యలపై పనిచేసారని అన్నారు.

కార్యక్రమం లో సిపిఎం మండల కార్యదర్శి క్రాంతి కుమార్, సిరిపురపు శ్రీనివాస్, రొంగల వీరాజు, మహాపాతిన రాంబాబు, దారపురెడ్డి సత్యనారాయణ, కూనిరెడ్డి అప్పన్న, ఎస్ బంగారురాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆత్రేయపురంలో ఘనంగా విహెచ్పిఎస్ 19వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 28:**డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా -- ఆత్రేయపురం మండలం:

వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్పీఎస్) 19వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆత్రేయపురం మండలంలో ఘనంగా నిర్వహించారు.పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అన్న ఆదేశాల మేరకు కొమ్మర రాఘవ మాదిగ ఆధ్వర్యంలో లొల్ల ఎం.పి.పి.ఎస్. పాఠశాలలోని భవిత కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగులతో కేక్ కట్ చేయించి, వారికి అవసరమైన స్టేషనరీ సామగ్రి, పండ్లను అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎం.ఎస్.పి. జిల్లా మాజీ అధ్యక్షులు యార్లగడ్డ సత్తిబాబు మాదిగ మాట్లాడుతూ, దివ్యాంగులు నేడు పొందుతున్న పింఛన్లు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ చేసిన పోరాటాల ఫలితమేనని తెలిపారు. దివ్యాంగుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాస్టర్ వాసు, గోవింద్, సాయి, ఉపాధ్యాయులు అరుణ, జానకి, విద్యార్థులు, తల్లిదండ్రులతో పాటు ఎం.ఎస్.పి. జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి గంధం యాకోబు మాదిగ, ముప్పిడి పండు, రాచర్ల అరుణ్ కుమార్, కౌలురి కళ్యాణ్, కొమ్మర భాను, దిగుమర్తి జశ్వంత్, గొర్త సీమోను తదితరులు పాల్గొన్నారు.

## రాఖీ కట్టి.. చెట్టుతో బంధం!

- వృక్షాబంధన్‌తో ప్రకృతి పరిరక్షణకు పిలుపు



**గండేపల్లి, పెన్ పవర్,, ఆగస్టు 28:**రాఖీ పౌర్ణమి సందర్భంగా చెట్టుకు రాఖీ కట్టి ప్రకృతి పరిరక్షణపై అవగాహన కల్పించారు జాతీయ పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత తోటకూర గంగాధర్. గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలో ఆయన వినూత్నంగా 'వృక్షాబంధన్' కార్యక్రమాన్ని నిర్వహించి అనంతరం మొక్కలు నాటారు.

ఆదిత్య యూనివర్సిటీ ప్రో-ఛాన్సలర్ డా. నల్లమిల్లి సతీష్ రెడ్డి పిలుపు మేరకు ప్రకృతి పరిరక్షణను తన బాధ్యతగా భావించి ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు గంగాధర్ తెలిపారు. రక్షాబంధన్ ద్వారా సోదర, సోదరీ బంధం బలపడితే.. వృక్షాబంధన్ ద్వారా మనిషికి ప్రకృతితో అనుబంధం బలపడుతుందని పేర్కొన్నారు.

'మొక్క నాటడం.. భవిష్యత్తుకు ఊపిరి పోయడం' అనే సందేశంతో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఆయన పిలుపునిచ్చారు. రాఖీ పండుగ రోజున సోదరుడు లేదా సోదరి పేరుతో ఒక మొక్కను నాటి, దానిని కుటుంబ సభ్యుడిలా పెంచే సంప్రదాయాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకమే ప్రధాన మార్గమని స్పష్టం చేశారు.

ప్రతి ఒక్కరూ తమ సోదరి లేదా సోదరుడి పేరిట మొక్కలు నాటి, వాటిని సంరక్షించడం ద్వారా ప్రకృతి పరిరక్షణలో భాగస్వాములు కావాలని ప్రొఫెసర్ డా. ఎన్. విశాలాక్షి, ప్రొ. వి. సునీత కోరారు.

వృక్షాబంధన్ ద్వారా మొక్కల పెంపకంపై ప్రజల్లో అవగాహన కల్పించడం అభినందనీయమని యూనివర్సిటీ డిప్యూటీ ప్రో-ఛాన్సలర్ డా. మేడపాటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఇలాంటి వినూత్న కార్యక్రమాలు పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో బాధ్యతను పెంచుతాయని పేర్కొంటూ అందరికీ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.

# బాలింతకు బయటకు రావాలన్నా అడ్డంకులేనా?






- ప్రభుత్వ డ్రైన్‌పై పలక వేస్తే రాజకీయ కక్షతో తొలగిస్తున్నారంటూ ఆవేదన
- అమాయకులపై అక్రమ కేసులు, వేధింపులు ఆపాలి: మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి
- లేకపోతే ఆత్రేయపురం పోలీస్‌స్టేషన్ ముట్టడిస్తాం

**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 28:**ఒకవైపు ఒడిలో పసిబిడ్డ... మరోవైపు ఇంటి నుంచి బయటకు రావాలన్నా దారి లేని పరిస్థితి... నాలుగు అడుగుల ఎత్తైన అరుగు నుంచి చిన్నారిని ఎత్తుకుని కిందకు దిగాలంటే కనీసం ఒక పలక అవసరం. ఆ పలకను కూడా కొందరు రాజకీయ కక్షతో తొలగిస్తే ఆ తల్లి పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించాలి. ఇది అభివృద్ధి చెందిన సమాజంలో ఒక కుటుంబం ఎదుర్కోవాల్సిన పరిస్థితి కాదని వైఎస్సార్‌సీపీ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు.ఆత్రేయపురం మండలం ఆత్రేయపురం గ్రామంలో ఓ బాలింత మహిళ, ఆమె కుటుంబాన్ని రాజకీయ కక్షతో వేధిస్తున్నారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు ప్రభుత్వ డ్రైన్‌పై ఏర్పాటు చేసుకున్న పలకలను రాత్రివేళల్లో తొలగిస్తున్నారని, దీంతో బాలింత తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్‌సీపీ నేతలు ఆరోపించారు.

ఈ ఘటనపై డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆత్రేయపురం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి పోలీసు అధికారులను కలిసి సమస్యను వివరించారు.

"బిడ్డను ఎత్తుకుని ఇంటి నుంచి బయటకు రావడానికి ఒక చిన్న పలక వేసుకోవడమే ఆమె చేసిన తప్పా? బాలింతను కూడా రాజకీయ కక్షకు గురిచేయడం ఏమిటి?" అని చిర్ల జగ్గిరెడ్డి ప్రశ్నించారు.

సదరు ఇంటికి గతంలో ప్రభుత్వం పట్టా ఇచ్చిందని, ఇంటి ముందు ఉన్న డ్రైన్ ప్రభుత్వానికి సంబంధించినదని, దాని ముందు ఉన్న రహదారి కూడా పంచాయతీ/ప్రభుత్వ రహదారేనని సంబంధిత అధికారులు గతంలోనే పరిశీలించి స్పష్టం చేసినట్లు ఆయన తెలిపారు. అధికారులు వాస్తవాలను నిర్ధారించిన తర్వాత కూడా కొందరు వ్యక్తులు తమకు నచ్చిన రీతిలో వ్యవహరిస్తూ ఓ బాలింతను ఇబ్బందులకు గురిచేయడం దారుణమన్నారు.

ప్రశ్నిస్తే కేసులా?

గ్రామంలో సమస్యను శాంతియుతంగా పరిష్కరించాలని పెద్దలు ప్రయత్నిస్తే, వారిపైనే కేసులు నమోదు చేయడం ఏమిటని చిర్ల జగ్గిరెడ్డి నిలదీశారు.

"ప్రజల సమస్యపై ప్రశ్నించడం నేరం కాదు. గ్రామంలో అన్యాయం జరుగుతుంటే పెద్దలు మాట్లాడటం తప్పు కాదు. ప్రశ్నించిన వారిని పోలీస్‌స్టేషన్‌కు పిలిచి భయపెట్టడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు" అని అన్నారు.చట్టాన్ని గౌరవిస్తూ పోలీసులు వ్యవహరించాల్సిన చోట రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను పదేపదే స్టేషన్‌కు పిలిపించి వేధిస్తున్నారనే భావన ప్రజల్లో ఏర్పడుతోందని ఆరోపించారు.

టీడీపీ నేతల మెప్పు కోసం పోలీసులపై ఒత్తిళ్లా?

కొత్తపేట నియోజకవర్గంలో స్థానిక టీడీపీ నాయకుల ఒత్తిళ్లకు పోలీసులు లొంగి వ్యవహరిస్తున్నారనే అభిప్రాయం ప్రజల్లో కలుగుతోందని చిర్ల జగ్గిరెడ్డి అన్నారు.బండారు సత్యానందరావు కళ్లలో ఆనందం చూడటం కోసం, స్థానిక టీడీపీ నాయకుల మెప్పు కోసం వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టడం, వారిని స్టేషన్‌ల చుట్టూ తిప్పడం మానుకోవాలి" అని హెచ్చరించారు. ఎవరైనా తప్పు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, తాము పూర్తిగా సహకరిస్తామని చెప్పారు. కానీ రాజకీయ ఒత్తిళ్లతో అమాయకులను వేధించడం మాత్రం సహించబోమన్నారు.

"బాలింత కన్నీటికి కూడా రాజకీయ రంగు పూయొద్దు"

ప్రభుత్వ డ్రైన్, పంచాయతీ రోడ్డుపై ప్రైవేటు వ్యక్తుల పెత్తనం ఉండకూడదని చిర్ల జగ్గిరెడ్డి డిమాండ్ చేశారు. పంచాయతీ, రెవెన్యూ, పోలీసు అధికారులు సమన్వయంతో సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు.

ఒక బాలింత తన బిడ్డను ఎత్తుకుని సురక్షితంగా ఇంటి నుంచి బయటకు రావడానికి దారి కోరుతోంది. అది రాజకీయ డిమాండ్ కాదు... కనీస మానవ హక్కు. ఆ చిన్నారి తల్లి అడుగులకు అడ్డుగా నిలవకుండా, సమస్యను మానవీయంగా పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ నేతలు కోరుతున్నారు.

ఇకపై బాలింతను ఇబ్బంది పెట్టే చర్యలు, గ్రామ పెద్దలపై కేసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు--కార్యకర్తలపై పోలీసుల వేధింపులు కొనసాగితే ప్రజలతో కలిసి ఆత్రేయపురం పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించే కార్యక్రమం చేపడతామని చిర్ల జగ్గిరెడ్డి తీవ్రంగా హెచ్చరించారు."కూటమి ప్రభుత్వం అంటే అభివృద్ధి కావాలి... అక్రమ కేసులు, కక్ష సాధింపు కాదు. అధికార యంత్రాంగం రాజకీయాలకు కాకుండా ప్రజలకు అండగా నిలవాలి" అని ఆయన స్పష్టం చేశారు.



## దేశ రక్షణ భారం కలిగి ప్రార్థించాలి: వన్డే స్త్రీల రిట్రీట్ లో డా. కరోలిన్ సందీపా





**సామర్లకోట.. పెన్ పవర్.. ఆగస్టు.. 28..**భారతదేశ రక్షణ కోసం స్త్రీలంతా భారం కలిగి ప్రార్థించాలని ప్రముఖ క్రైస్తవ వర్తమానికురాలు డా. కరోలిన్ సందీపా అన్నారు. సామర్లకోట ఆంధ్ర జూబ్లీ బాప్టిస్ట్ చర్చిలో శుక్రవారం ఒకరోజు స్త్రీల రిట్రీట్ కార్యక్రమం సంఘ స్త్రీల సమాజం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్త్రీల సమాజ నాయకులు బి అన్నపూర్ణ డేనియల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య ప్రసంగీకురాలుగా డా. కరోలిన్ సందీపా పాల్గొని దైవ వర్తమానాలు అందజేశారు. తనకు దేవుడిచ్చిన పిలుపుమేరకు భారతదేశంలోని ప్రజలు నశించి పోకుండా నిత్యత్వంలోనికి ప్రవేశించేందుకుగాను సువార్త ప్రకటించేందుకు ప్రయాస పడుతున్నట్టు చెప్పారు. దానికిగాను దేవునితో అనునిత్యం ప్రార్థన ద్వారా సంభాషిస్తూ ప్రజల రక్షణకు ఎవరికి వారే పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఆంధ్ర జూబ్లీ బాప్టిస్ట్ సంఘ స్త్రీల సమాజం ఆలపించిన భక్తి గీతాలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో ముఖ్య ప్రసంగికురాలు సందీపా ను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించి అభినందించారు. సాయంత్రం వరకు కొనసాగిన ఈ కార్యక్రమంలో సంఘ కాపరి రెవ. బివి రాజు, సంఘ అధ్యక్షులు బిఎస్ వందనం, కార్యదర్శి టి సూర్యారావు, సహాయ కార్యదర్శి పిట్టా సత్యనారాయణ, స్త్రీల సమాజ అధ్యక్షురాలు ఊబా లక్ష్మి, కార్యదర్శి బొడ్డు శ్రీ లక్ష్మి (ఎస్తేరు), కోశాధికారి పాలిక కుసుమ, బి భారతి కుమారి, బాప్టిస్ట్ ఫీల్డ్ కౌన్సిల్ నాయకులు ఐఈ జీవన్ కుమార్,ఎండి వి ప్రసాద్, భారీ సంఖ్యలో స్త్రీలు పాల్గొన్నారు.

## పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి ఆలయంలో పసుపు కొమ్ములతో సౌభాగ్య వ్రత



**పెద్దాపురం.. పెన్ పవర్. ఆగస్టు. 28..** శ్రావణమాసం మూడవ శుక్రవారం సందర్భంగా మరిడమ్మ అమ్మవారి ఆలయంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సామూహిక వరలక్ష్మి వ్రత పూజలు భక్తుల అమ్మవారికి సమర్పించిన పసుపు కొమ్ములతో నిర్వహించారు. ఈ పూజలో పెద్దాపురం పరిసర ప్రాంతాల నుంచి మాత్రమే కాకుండా దూర ప్రాంతాల నుంచి మహిళా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పాల్గొన్నారు. శ్రావణమాసంలో ఆలయ అధికారిణి, దేవాదాయ సహాయ కమిషనర్ కే విజయలక్ష్మి భక్తులు సమర్పించిన దోసెడు పసుపు కొమ్ములతో సౌభాగ్య వరలక్ష్మి వ్రత పూజలను నిర్వహించారు. ఆలయ పండితులు, అర్చకులు ఈ సౌభాగ్య వ్రత పూజలను భక్తులతో శాస్త్రక్తంగా జరిపించారు. పూజలకు అవసరమైన పూజ సామాగ్రిని భక్తులకు దేవాలయం తరఫున అందజేయడంతో పాటు అమ్మవారి పసుపు కొమ్ములను, ప్రత్యేక ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ పూజలో ఆలయ సిబ్బంది, ఆలయ ధర్మకర్త శ్రీహర్ష కుటుంబ సభ్యులు, పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

## ఏపీ గ్రీన్ సొసైటీ చైర్మన్‌గా నాగబాబు ప్రమాణ స్వీకారం- పాల్గొన్న మేడిశెట్టి బాబి....


ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబును ఘన సత్కారం....



**శంఖవరం పెన్ పవర్ ఆగస్టు 28:-** ఆంధ్రప్రదేశ్ గ్రీన్ సొసైటీ కార్యనిర్వాహక కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి బాబీ మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మంగళగిరి లోని అరణ్య భవన్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మేడిశెట్టి బాబీ పుష్పగుచ్ఛం అందజేసి నాగబాబుకు అభినందనలు తెలియజేశారు.నాగబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ గ్రీన్ సొసైటీ మరింత అభివృద్ధి సాధించి, పర్యావరణ పరిరక్షణతో పాటు రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు విశేషంగా కృషి చేయాలని మేడిశెట్టి బాబీ ఆకాంక్షించారు.పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ రాష్ట్రంలో పచ్చదనం పెంపొందించే కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టాలని కోరారు.

ఏపీ గ్రీన్ సొసైటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కొణిదెల నాగబాబుకు మేడిశెట్టి బాబీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నాయకత్వంలో సంస్థ పర్యావరణ పరిరక్షణలో ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.


## ఇర్రిపాకలో ఘనంగా సామూహిక వరలక్ష్మి వ్రతాలు



**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 28:** శ్రావణ శుక్రవారం, పౌర్ణమి సందర్భంగా జగ్గంపేట మండలం ఇర్రిపాక గ్రామంలోని శివ కేశవుల క్షేత్రంలో ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యులు, టిడిపి పొలిటి బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ మణి దంపతుల ఆధ్వర్యంలో ఇర్రిపాక మహిళలచే సామూహిక వరలక్ష్మీ వ్రతాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు పద్మావతి దేవి గంగారత్నం దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించిన 200 మంది మహిళలకు వరలక్ష్మి బంగారు రూపు, పట్టుచీర, పసుపు కుంకుమలను, జ్యోతుల నెహ్రూ మణి, కంబాల శ్రీనివాసరావు పద్మావతి దేవి గంగారత్నం దంపతులు పంపిణీ చేసారు.

## జనసేన నేత మేడిశెట్టి బాబీకి రాఖీ కట్టిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ.

-నియోజవర్గ ప్రజలకు రాఖీ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే సత్యప్రభ,మేడిశెట్టి బాబీ.




**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, ఆగస్టు, 28:**రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడి టీడీపీ కార్యాలయంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా,జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి,ప్రత్తిపాడు నియోజకవర్గం జనసేన సమన్వయకర్త మేడిశెట్టి బాబీకి రాఖీ కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ,జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి బాబీ నియోజకవర్గ ప్రజలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను ప్రజలంతా సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

## సెప్టెంబర్ 1న ఛలో విజయవాడను జయప్రదం చేయాలి.




**-ఉద్యోగుల హక్కుల కోసం మరోసారి ఐక్యంగా ఉద్యమించాలి.**

**-సిపిఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, ఎం రవికుమార్.**

**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పెన్, ఆగస్టు, 28**:కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలు చేయాలనే ప్రధాన డిమాండ్‌తో ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న నిర్వహించనున్న 'ఛలో విజయవాడ' కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సీపీఎస్ ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సంఘ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డా. ఎం. రవికుమార్ పిలుపునిచ్చారు.సీపీఎస్ ఉద్యోగుల హక్కుల సాధన కోసం సంఘం నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తోందని పేర్కొన్నారు. గతంలో చేపట్టిన పోరాటాల ఫలితంగా విధి నిర్వహణలో మృతి చెందిన సీపీఎస్ ఉద్యోగుల కుటుంబాలకు కుటుంబ పెన్షన్,గ్రాట్యుటీ ప్రయోజనాలు సాధించామని తెలిపారు.2003 బ్యాచ్ ఉద్యోగులకు ఓపీఎస్ ప్రయోజనాలు వర్తింపజేసే విషయంలోనూ సంఘం కీలకంగా పోరాడిందన్నారు.ఉద్యోగుల ఐక్యత,సంఘటిత పోరాటాల ద్వారానే గత విజయాలు సాధ్యమయ్యాయని,సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయించుకునేందుకు మరోసారి ఉద్యోగులంతా ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని రవికుమార్ పేర్కొన్నారు.సెప్టెంబర్ 1న విజయవాడలో జరిగే 'ఛలో విజయవాడ' కార్యక్రమానికి ప్రతి సీపీఎస్ ఉద్యోగి తరలివచ్చి ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని కోరారు."నిన్నటి విజయాలకు పోరాటమే కారణం.. రేపటి విజయాలకు ఐక్యతే బలం.ఉద్యోగుల భవిష్యత్ భద్రత కోసం ప్రతి సీపీఎస్ ఉద్యోగి విజయవాడకు తరలిరావాలి" అని డా. ఎం.రవికుమార్ పిలుపునిచ్చారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# కాజులూరు బుద్ధ విహార్‌లో ఘనంగా శ్రావణ పూర్ణిమ పూజ





**కాజులూరు, పెన్ పవర్,ఆగస్టు 28:** కాజులూరు మండల కేంద్రంలోని బుద్ధ విహార్‌లో త్రిరత్న బౌద్ధ కమిటీ ఆధ్వర్యంలో శ్రావణ పూర్ణిమ పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీ భీమ్ రావ్ రాంజీ ప్రజా సంక్షేమ సంఘం కార్యదర్శి కూటి రంజిత్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా బుద్ధుడు, బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి వందనం సమర్పించారు. ఈ సందర్భంగా ఉపాసిక పి. నరసింహమూర్తి మాస్టారు మాట్లాడుతూ బుద్ధుని జీవన విధానం నేటి సమాజానికి ఎంతో అవసరమని, ఆయన బోధనలు, జీవన విలువల నుంచి ప్రతి ఒక్కరూ అనేక విషయాలు నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత, పిల్లలు,బుద్ధ విహార్ కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. బుద్ధుని బోధనలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా,ఇటువంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహించేలా నూతన కమిటీ కృషి చేయాలని పెద్దలు కోరారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# కుష్టు వ్యాధి గుర్తింపు కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలి



**జేసీ అపూర్వ భరత్**

**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 28:** జిల్లాలో జాతీయ కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి, వ్యాధి నియంత్రణ చర్యలను కట్టుదిట్టంగా అమలు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ వైద్య, మున్సిపల్ శాఖల అధికారులను ఆదేశించారు. సెప్టెంబర్ 11 నుంచి 24వ తేదీ వరకు 14 రోజులపాటు నిర్వహించనున్న కార్యక్రమ సన్నద్ధతపై కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ పురుష, మహిళా ఆరోగ్య కార్యకర్తలు బృందాలుగా ఏర్పడి ప్రతి ఇంటినీ సందర్శించి 100 శాతం సర్వే నిర్వహించాలని, ఒక్క కేసు కూడా గుర్తింపునకు దూరం కాకుండా చూడాలన్నారు. వ్యాధి లక్షణాలు ఉన్నట్లు నిర్ధారణ అయితే వెంటనే వైద్య చికిత్స అందించాలని, అంగవైకల్యానికి గురికాకుండా సకాలంలో సేవలు, అవసరమైన వారికి పునరావాసం కల్పించాలని సూచించారు. ప్రజలకు వ్యాధి లక్షణాలు, నివారణ మార్గాలపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు.

జిల్లాలో కుష్టు కేసులు తగ్గుముఖం పట్టడంపై సంతృప్తి వ్యక్తం చేసిన జేసీ, భవిష్యత్తులో కాకినాడ జిల్లాను కుష్టు రహిత జిల్లాగా మార్చే లక్ష్యంతో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ కె.అనిత, జిల్లా కుష్టు వ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ చలమయ్య, ఎంహెచ్ఓ పృథ్వీ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# అర్జీలను వేగంగా పరిష్కరించాలి: జేసీ అపూర్వ భరత్





**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 28**: "ఒక నెల--ఒక గ్రామం--నాలుగు సందర్శనలు" కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన అర్జీలను అధికారులు వేగంగా పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ ఆదేశించారు. కాకినాడ రూరల్ నియోజకవర్గ స్థాయిలో ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమంలో డివిజన్ అభివృద్ధి అధికారి పి. వాసుదేవరావుతో కలిసి జేసీ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను జేసీకి వివరించగా, 28 అర్జీలు అందినట్లు తెలిపారు. వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. గత రెండు వారాల్లో అందిన అర్జీలను కూడా క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు.

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెలా ఒక నియోజకవర్గాన్ని ఎంపిక చేసి, నాలుగు వారాలపాటు ప్రతి శుక్రవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జేసీ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక గ్రీవెన్స్ వేదికను అధికారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాకినాడ రూరల్ ఎంపీడీవో పి. సతీష్, తహశీల్దార్లు,ఎంపీడీవోలు,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నేడు దిశా సమావేశం

**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 28:** కాకినాడ జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం శనివారం (ఆగస్టు 29) ఉదయం 10.30 గంటలకు కాకినాడ జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలోని జి.ఎం.సి. బాలయోగి సమావేశ మందిరంలో నిర్వహించ నున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. దిశ కమిటీ అధ్యక్షులు, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అధ్యక్షతన ఈ సమావేశం జరగనుంది. సమావేశానికి సంబంధిత ప్రజాప్రతినిధులు, కమిటీ సభ్యులు, కాకినాడ జిల్లా పరిధిలోని వివిధ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు. అధికారులు తమ శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని సూచించారు.

## ఉపాధ్యాయులకు టెట్ నిబంధన రద్దు చేయాలి.





- ప్రత్తిపాడులో యూటీఎఫ్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ..
- అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా

**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్,ఆగస్టు, 28:** పాతికేళ్లుగా సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ (ఉపాధ్యాయ అర్హత పరీక్ష) నిబంధనను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ప్రత్తిపాడులో బైక్ ర్యాలీ తోపాటు అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ప్రత్తిపాడు,ఏలేశ్వరం,శంఖవరం, కిర్లంపూడి మండలాలకు చెందిన యూటీఎఫ్ నాయకులు,ఉపాధ్యాయులు స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద నుంచి బైక్ ర్యాలీ ప్రారంభించారు. ప్రత్తిపాడు ప్రధాన వీధుల మీదుగా ర్యాలీ కొనసాగింది. అనంతరం అంబేద్కర్ కళామందిర్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద యూటీఎఫ్ నాయకులు,ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. పాతికేళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్న వారికి మళ్లీ టెట్ రాయాలనే నిబంధనను విధించడం సరికాదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఉపాధ్యాయుల అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని టెట్ నిబంధన నుంచి మినహాయింపు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు వీవీ రమణ, జట్ల సోమరాజు,తోట సీతారామయ్య, మండల శాఖల అధ్యక్షులు కోడి శ్రీనివాసరావు, ఏ ఆదివిష్ణు, ఎన్ రమణ, పీఎస్ఎస్ చంటిబాబు,నాయకులు ఎం వి రమణ, జీఎస్ ప్రసాద్‌బాబు, డీఎల్ఎన్ఆర్ డీఎల్ ఈశ్వరుడు,సీహెచ్ఎల్ గణేష్, ఎస్వీ సూర్యనారాయణ,కె రోహిణి తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రత్తిపాడు మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం



**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, ఆగస్టు, 28:** ప్రత్తిపాడు మండలంలోని 11 కేవీ ఒమ్మంగి వ్యవసాయ ఫీడర్ పరిధిలోని రాచపల్లి,ఒమ్మంగి గ్రామాలతో పాటు 11 కేవీ ధర్మవరం వ్యవసాయ ఫీడర్ పరిధిలోని ధర్మవరం గ్రామ విద్యుత్ వినియోగదారులకు శనివారం విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని జగ్గంపేట విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఒక ప్రకటనలో తెలిపారు. లైన్ మరమ్మతులు,విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల తొలగింపు పనుల నేపథ్యంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదేవిధంగా ఉత్తరకంచి ఉపకేంద్రంలోని 11 కేవీ చిన్న శంకర్లపూడి ఫీడర్ పరిధిలో వ్యవసాయ బోర్లకు తెల్లవారుజామున 3 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు,తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా చేయనున్నట్లు తెలిపారు. సింగిల్ ఫేజ్ గృహ విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం ఉండదని స్పష్టం చేశారు. మరమ్మతు పనులకు రైతులు,విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ జగ్గంపేట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి వీరభద్రరావు ఈ సందర్భంగా కోరారు.

# పిఠాపురంలో పేకాట శిబిరంపై పోలీసుల దాడి

9 మంది అరెస్ట్.. రూ.57,300 నగదు స్వాధీనం




**పిఠాపురం, పెన్ పవర్,ఆగస్టు 28:** పిఠాపురం పట్టణంలోని వైఎస్ఆర్ గార్డెన్‌లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి తొమ్మిది మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.57,300 నగదును స్వాధీనం చేసుకున్నారు.కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్, ఆదేశాల మేరకు జిల్లాలో అసాంఘిక, జూద కార్యకలాపాలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా పిఠాపురం టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వైఎస్ఆర్ గార్డెన్ వద్ద పేకాట నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్సై వి. మణికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి నిర్వహించి పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.57,300 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై పిఠాపురం టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. జిల్లాలో పేకాట, కోడి పందేలు, గుండాట తదితర అసాంఘిక,జూద కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ బిందుమాధవ్ హెచ్చరించారు. ప్రజలు ఇటువంటి కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, ఎక్కడైనా జూద కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

# వికాస ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ

- సెప్టెంబర్ 15 నుంచి వాకలపూడిలో తరగతులు
- శిక్షణ అనంతరం ఉద్యోగావకాశాలు

**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 28:** నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణతో పాటు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు వికాస ఆధ్వర్యంలో సెప్టెంబర్ 15వ తేదీ నుంచి కాకినాడ వాకలపూడిలోని డి.డి.యు.జి.కే.వై సెంటర్‌లో శిక్షణా తరగతులు ప్రారంభించనున్నట్లు వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ లచ్చారావు తెలిపారు. ఈ శిక్షణకు ఎస్ఎస్సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా ఉత్తీర్ణులైన 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు గల పురుష అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. టూవీలర్ టెక్నీషియన్, వేర్‌హౌస్ ఎగ్జిక్యూటివ్, మల్టీ స్కిల్ టెక్నీషియన్ కోర్సుల్లో మూడు నెలలపాటు శిక్షణ అందిస్తామని తెలిపారు. శిక్షణ పూర్తయిన అనంతరం ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో సర్టిఫికెట్ అందజేస్తారని తెలిపారు. శిక్షణా కాలంలో అభ్యర్థులకు ఉచిత భోజనం, వసతి, యూనిఫారం, స్టడీ మెటీరియల్ అందిస్తామని పేర్కొన్నారు. వీటితో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్‌పై కూడా ప్రత్యేక శిక్షణ ఇస్తామని తెలిపారు.

**గ్రామాల్లో రిజిస్ట్రేషన్**


శిక్షణకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు సెప్టెంబర్ 15వ తేదీలోపు 8328483297, 8978475164, 6305934450 నంబర్లను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వికాస అధికారులు సూచించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా కరప మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల వద్ద వికాస సిబ్బంది హాజరై అభ్యర్థుల వివరాలను నమోదు చేయనున్నారు.

- అరట్లకట్ట: సెప్టెంబర్ 2
- గొర్రెపూడి: సెప్టెంబర్ 8
- కరప: సెప్టెంబర్ 9
- నడకుదురు: సెప్టెంబర్ 10
- వేలంగి: సెప్టెంబర్ 11

నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ వివరాలను నమోదు చేసుకోవాలని అధికారులు కోరారు.

## ఎం ఎం పల్లంరాజుని మర్యాదపూర్వకంగా కలిసిన ధరణాలకోట శ్రీను

-స్థానిక ఎన్నికల్లో అభ్యర్థులను బరిలోకి దింపాలని సూచన



**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, ఆగస్టు, 28:** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున అభ్యర్థులను నిలబెట్టి పోటీ చేయాలని మాజీ కేంద్ర మంత్రి మల్లిపూడి మంగపతి పల్లంరాజు సూచించారని పీసీసీ సభ్యుడు,జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ధరణాలకోట శ్రీను తెలిపారు. కాకినాడలోని పల్లంరాజు నివాసంలో శుక్రవారం ధరణాలకోట శ్రీను పల్లంరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ పరిస్థితులు,రాబోయే స్థానిక ఎన్నికలపై చర్చించారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను బరిలోకి దింపి, ప్రజల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పల్లంరాజు ఆదేశించినట్లు శ్రీను పేర్కొన్నారు. పార్టీ నాయకులు,కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని సూచించినట్లు తెలిపారు.

